—యమ్.జయశ్రీ

# లవ్ ట్రా(ప్)క్

## చెమ్కీ తిన్నావే.... చిన్నినాయనా

"ప్రవీణ్.....!" మత్తుగా పిల్చింది ప్రియ.

"ఏమిటి.....?" చెవిలో గుసగుసగా అడిగాడు.

"రేపు మా ఇంటికి 'లంచ్'కి రావాలి నువ్వు."

గారాబంగా చెప్పింది ప్రియ.

"వాట్ ఎ వండర్...? ఎప్పుడూ పిలవని దానివి ఈరోజు ఆహ్వానిస్తున్నావ్... ఏమిటా విశేషం?"

"విశేషం ఏమీలేదు. రేపు మా మమ్మీ డాడీ ఇద్దరూ ఊరెళుతున్నారు మనం ఏకాంతంగా వుండొచ్చు."

"ప్లీజ్... రావాలి" ఈసారి రిక్వెస్ట్ చేసింది. "తప్పకుండా వస్తాను... కానీ ఒక షరతు."

'లంచ్' నువ్వే ప్రిపేర్ చేయాలి. "ఏమంటావ్ అన్నట్లుగా చూశాడు.

"ఓ... ష్యూర్..." ఆనందంగా ఒప్పుకొంది

"రేపు అమ్మాయిగారి చేతి వంట రుచి చూడాలి కాబోలు. తమాషాగా భుజాలెగరవేశాడు ప్రవీణ్. మర్నాడు సరిగ్గా ప్రవీణ్ 12–00 గంటలకు వెళ్ళాడు ప్రియా ఇంటికి.

కాసేపు కబుర్ల తర్వాత 'భోంచేద్దాం' రమ్మంటూ డైనింగ్ రూమ్‌కి తీసుకెళ్ళింది.

ఒక్కో ఐటమ్ వడ్డిస్తోంది ప్రియ.

చికెన్ జింజర్,
మష్రూమ్స్ కిత్ కాజు గ్రేవీ!
స్టఫడ్ కాప్సికమ్,
దాల్చా
ఎగ్ ఫ్రయిడ్ రైస్
లాస్ట్ ఐటమ్ స్వీట్ "బాసుంది' ఇచ్చింది.

అద్భుతంగా వున్నాయి డిషెష్ అన్నీ నిజంగా కళ్ళు తిరిగాయి ప్రవీణ్‌కి.

భోజన ప్రియుడేమో చక్కగా వడ్డించినవన్నీ తిన్నాడు.

"ప్రియా... ఈ వంటకాలన్నీ ఏ ఫైవ్‌స్టార్ హోటల్‌లో నుండయినా తెప్పించలేదుగదా...?" ప్రియని ఏడిపించాలని అన్నాడు.

"ప్చ్... ప్రవీణ్... నేనే స్వయంగా చేశాను."

ఆ అమ్మాయి కళ్ళల్లో ఉక్రోషం తన్నుకొస్తోంది.

"ఈ రోజుల్లో అమ్మాయిలకు అన్నం వండటం కూడా రాదని మా అమ్మ వాదన. నీ గురించి ఇంతకు ముందే చెప్పాను గదా— ఇవాళ నీ చేత వంట ఎంత రుచిగా వుంటుందో చెప్తాను— "మా అమ్మ ఎగిరి గంతేసి వెంటనే మన పెళ్ళికి ఒప్పుకొంటుంది" అంటున్నాడు ప్రవీణ్.

ప్రవీణ్ అన్నట్లుగానే నెల తిరక్కముందే ప్రవీణ్ ప్రియల పెళ్ళికి ముహూర్తం పెట్టారు.

* * *

పెళ్ళికి వచ్చిన స్నేహితురాలు ప్రియని రహస్యంగా అడుగుతోంది "ప్రియా లాస్ట్ మంత్‌లో నీవు వ్రాసిన లెటర్లో" ప్రవీణ్ వాళ్ళమ్మ బాగా కట్నం ఆశతో వున్నదనీ అన్నిలక్షలతో సరితూగలేమని మీడాడీ అంటున్నారని, వ్రాశావు గదా ఇంత త్వరలో ఎలా దిగి వచ్చారే వాళ్ళు?"

ఆ మాటలకి ప్రియా చిన్నగా నవ్వి ఇలా చెప్పింది.

"ప్రవీణ్ వాళ్ళమ్మ ఇద్దరూ భోజన



ప్రియులని నాకు తెలిసింది. అంతే! ఒక చిన్న ట్రిక్ ప్లే చేశాను— ప్రవీణ్‌ని భోజనానికి పిల్చాను. ఆ రోజు మన పద్మజ అదేనే ఫుడ్ & కేటరింగ్‌లో డిప్లొమా హోల్డర్— దానిచేత వంటంతా చేయించాను. దాంతో ప్రవీణ్, వాళ్ళమ్మ ఇద్దరూ బోల్తా పడ్డారు." *